# వందేమాతరం

– టి. ఆర్. ఇంద్ర

హైదరాబాద్ నగరం.

ఓ ప్రక్క అసెంబ్లీ హాలు, రవీంద్రభారతి. పోలీస్ కంట్రోల్ రూము.

మరో ప్రక్క కమనీయమైన పబ్లిక్ గార్డెన్స్. బస్‌స్టాప్‌లనిండా జనం.

రకరకాల మతాలవారు, కులాలవారు, రంగురంగులతో కళకళలాడిపోతోంది భాగ్యనగరం. రోడ్లంతా సందడే సందడి. బస్సులు, కార్లు, రిక్షాలు, సైకిళ్లు, పోలీసు విజిల్సు, తప్పుకోండి తప్పుకోండి ముఖ్యమంత్రిగారి కారు సైరను మోతలు. పోలీసుల హడావుడి. సందడే సందడి. రయ్... బయ్ శబ్దాలు.

తెలుగువారి తెలుగు లలిత కళాతోరణం...బైట బ్యానర్లు స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సంబరాలు. అంబరాన్నంటుతున్నాయి సంబరాలు.

ఒక క్షణం ఆగాను, బస్సు దిగి మరో బస్సు ఎక్కుదామని. ఇద్దరు కుర్రాళ్లు గోచీగుడ్డలతో... ఓ కర్రకి జండా వుంది. లాక్కుంటూ, తిట్టుకుంటూ, కొట్టుకుంటున్నారు. బస్సు కోసం నిలబడ్డ జనం పట్టించుకోవడంలేదు. ముష్టివాళ్లలాగున్నారు.

'50 ఏళ్లు నిండినా ఏమిటీ బీదతనం. దరిద్రమా! మా దేశాన్ని వదిలిపో' మనసులోనే అనుకున్నా వాళ్లని చూసి.

ఇంతలో అక్కడికో 100 ఏళ్ల ముష్టివాడు వచ్చాడు. నిద్రపోయేవాడల్లా లేచి వాళ్లిద్దర్నీ విడదీయడానికి అవస్తపడుతూ ఎట్టకేలకు ''చచ్చినోళ్లారా... ఇయ్యాల పండగని చెప్పానా. తన్నుకోమాకండిరా'' అంటూ అరిచినంత పని చేసి ఇద్దర్నీ విడదీసాడు.

నా కళ్లు, చెవులు వాళ్లవైపే వున్నాయి.

''ఇయ్యాల 50 ఏళ్ల పండగని చెప్పానా. తన్నుకోకూడదని చెప్పానా... జండా పండగ చేసుకోవాల'' అంటూ చెరో రెక్క పట్టుకుని విడదీసాడు.

''నువ్వు చెప్పావనే రాత్రంతా గాలించి చెత్తలో దొరికిన రంగుల గుడ్డలు పట్టుకొచ్చి కుట్టి కట్టపడి ఈ జండా చేత్తే వీడు లాక్కుంటున్నాడు తాతా'' అన్నాడు రొప్పుతూ ఒకడు.

''అది కాదు తాతా... అందులో పచ్చగుడ్డ నేనే తెచ్చా. నాది నాకివ్వమంటున్నాడు. పోనీ సగం ఇవ్వరా అంటే కూడా ఇవ్వడంలేదు'' అంటూ తాతకి మొరపెట్టుకున్నాడు రెండోవాడు.

''చింపితే అది జండా కాదురా. గుడ్డపీలిక అవుతుంది. మూడురంగులూ కలిసుంటేనే అది జాతీయ జండా అవుతుంది. ఒక పని చేయండి. నువ్వేమో జండా భుజాన పెట్టుకో. నువ్వేమో జండా పండుగ బాబూ అని అడుక్కో.'' అంటూ సముదాయించాడు తాత.

బాగానే వుందనిపించింది ఇద్దరికీ. ''మా మంచి తాత'' అనుకుంటూ 50 ఏళ్లకోసారి ముచ్చటగా వచ్చిన మువ్వన్నెల పండగ జాతీయ పండగ. ధర్మం చేయండి బాబూ'' అనుకుంటూ బయలుదేరారు ఇద్దరూ.


రెండు అడుగులు వెళ్లేసరికి అనుమానం వచ్చి-

''తాతా! ఇది ఎవరి పండుగ? హిందువులదా? క్రిష్టియన్లదా? ముస్లిములదా? సిక్కులదా?'' అడిగారు అమాయకంగా. ఎవరి పండుగైతే వాళ్ల వీధులు తిరుగుదామని కాబోలు.

''ఒరేయ్! ఇది మతాలు, కులాల పండగ కాదురా. భారద్దేశం పండుగ. ఎవరింటికెళ్లినా పర్లేదు. పొండి'' అంటూ విషయం తెలిసిన నేటితో వంద సంవత్సరాలు వచ్చిన తాత చెప్పేసరికి ఆనందంతో గంతులు వేస్తూ. అర్థం కాకపోయినా...

మొత్తానికి పండుగే కదా. ఏదో ఓ పండుగ. 50 ఏళ్ల పండుగ వర్ధిల్లాలి అరుస్తూ బయలుదేరారు చేత్తో బొచ్చెతో.

''50 ఏళ్ల పండగ బాబూ. ధర్మం చేయండి'' అంటూ బయలుదేరు తున్న వారిని చూసి తాత మురిసిపోయా డు. తనలో తనే నవ్వుకున్నాడు.



తాతను చూస్తున్నంతసేపూ అతని దేశాభిమానానికి, జాతీయతా భావానికీ జోహారు అర్పించాలనిపించింది. అలాగే తాతవైపుకి చూస్తుండిపోయా. తాత వెళ్లి పేవ్‌మెంట్ పక్కగా గేటుముందు తన ప్లేటుతో తిరిగివెళ్లి కూర్చున్నాడు.


చేతి కర్రతో అటుగా వచ్చాడో కుంటి ముష్టాడు. ''ఏంది తాతా! సంబరాలు... ఏం పండగియ్యాల?'' ఆత్రంగా అడిగాడు తాతని.

''50 ఏళ్ల పండగరా చిన్నా. ఇది ఇవాళ ఒక్కరోజే కాదు పదిరోజులుంటది. సంవత్సరమంతా వచ్చే పండగ కాకుండా... 50 ఏళ్లకొచ్చిన పండగ ఇది'' వివరంగా

చెప్పాడు.

''అట్టానా? నాకు తెల్వదు తాతా. సమజ్‌కాలే. జర చెప్పరాదూ''

''పిచ్చోడా! వారం ముందు నుంచే కాకిగోల పెడుతుంటే అర్థంకాలా? మనకి స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లు దాటినయ్. ఎంత ముందు కెళ్లామో... ఎంత వెనకెలా ్లమో... టీవీలో గోలగా చెబుతుంటే చూడలే. టీవీకొట్టుకెళ్లి అర్థం లోచూడుపో...''



ఒంటిమీద గోచీగుడ్డతో వంగిపో యిన దేహంతో అనుభవాలు నింపుకున్న ఆ తాత ముఖం చూస్తుంటే జాతీయతా భావం కలిగింది. వంద ఏళ్లపైబడిన అతనికున్న దేశాభిమానం, జాతీయతాభావం ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ వుంటే ఎంత బావుంటుందనిపిం చింది. వారి మాటల్ని గమనిస్తున్నా పక్కనే నిలబడి.

''ఏం ముందుకెళ్లడమో తాతా... అడుక్కు తింటం మాత్రం తప్పటంలా. ఈ హైదరా బాద్‌లో ఒక చోటికి వెలితే మరో చోటుకు వెళ్లలేకపోతున్నా తాతా'' అంతా... అంతా కవర్ చేయ లేక పోతు న్నానన్న ఫీలింగ్ చూపించాడు ముఖంలో.

''పిచ్చోడా! స్వాతంత్ర్య సమయంరో పాల్గొని లాఠీదెబ్బలు తిని, జైలుకెళ్లా. ఆ రోజులే వేరు. చక్కగా జైల్లో కూచోబెట్టి అన్నం పెట్టేవాళ్లు. నిజమే. రోజులు మారాయ్‌రా తమ్ముడూ. స్వాతంత్రం వచ్చాక అడుక్కోవడమే మంచిదనిపించింది. ఆ రోజుల్లో అణా, కానీ వేసేవాళ్లు... పండగ చేసుకునేటోల్లాం'' అంటూ నాటి కాలాన్ని గుర్తు చేసుకోసాగాడు తాత.

''ఈ రోజులే వేరు తాతా. రూపాయి తక్కువ ధర్మం తీసుకోకపోతేచాలు గడిచేటట్లులేదు మరి. నీకేం తాతా! టిక్కెట్టు లేకుండా కాశ్మీర్ నుంచి కన్యాకుమారిదాకా తిరుగుతావ్. బస్టాపులో పడుకుంటావ్. నీ పనే హాయి. వీలైతే ప్రజాసేవ. ముస్లోళ్లకి సేవ చేస్తావ్. మనూళ్లో స్వాతంత్ర్య సమరయోధుడివి నువ్వేకదా?'' అన్నాడు కొంచెం పొగుడుతూ.

తాత మనస్సు పొంగింది కొంచెం.

''తాతా! నీకు వంద ఏళ్లు వచ్చాయ్. ఈ దేశానికి 50 ఏళ్లు నిండినాయ్. మనోళ్లందరికీ సెప్పి నీకు చెయ్యాల నూర్లేళ్ల పండుగ'' అంటూ తాతని ఉబ్బేస్తున్నాడు కుర్రోడు.

తాత ముఖం ఆనందంతో నిండింది. గట్టిగా గాలి పీల్చి వదిలాడు. ఏదో తెలియని ఆనందం ముఖంలో తాండవించింది. చుట్టూ వున్న ముష్టివాళ్లనందర్నీ పిలిచాడు ముష్టోడు. అందరూ వచ్చి విషయం విని ''తాతకీ జై. తాతకీ జై... 50 ఏళ్ల పండక్కీ జై. తాతకీ జై'' అంటూ జేజేలు పలికారు తాతని ముందు నించోమని జండాలు భుజాన వేసుకుని ముష్టోలందరూ తాత చుట్టూ తిరుగుతూ జేజేధ్వానాలు చేసారు. తాతకు లోలోపల ఆవేశం వెల్లువయింది.

అందరూ వెళ్లిపోయారు.

తాత మెల్లగా టీవీ కొట్టు దగ్గరకి వెళ్లాడు. అద్దంలోంచి టీవీ చూస్తున్నాడు. టీవీలో గాంధీగారు... స్వాతంత్ర్య పోరాట దృశ్యాలు...వందేమాతర గీతం చూస్తున్నాడు చెమ్మగిల్లిన కళ్లతో.

అతన్నే చూస్తూ వెంబడించి వచ్చాన్నేను. అతని కళ్లు ఆనందంతో నిండిపోయాయి.

ఆహా! ఎంతటి జాతీయాభిమానం. అతన్ని చూసి నాకూ సంతోషమేసింది. టీవీలో వచ్చే ట్యూన్‌కి అనుగుణంగా మనస్సులో అనుకున్నా ''వందేమాతరం'' అని.

అప్రయత్నంగా తాత మాటలు వినిపించాయి మూడుసార్లు పెద్దగా.

''వందేమాతరం...వందేమాతరం...వందేమాతరం''

నేను కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నా.

''పాగల్ హైక్యా...జాజా..'' అనే అరుపు షాపు యజమానిది.

''అమ్మా'' అన్న అరుపు.

కళ్లు తెరిచి చూశాను.

తాత గుండెలమీద నుంచి వెళ్లిపోయింది. తల నుజ్జునుజ యింది.

రోడ్డుమీద రక్తం. చితికిపోయిన శరీరం.

''పకడో...పకడో'' ఆటో వెళ్లిపోయింది స్పీడుగా.

చుట్టూ జనం మూగారు.

తోసుకుంటూ వెళ్లి చూసా. తాత...!

''రోజూ ఇక్కడే అడుక్కుంటుండేవాడు. పాపం...స్వర్ణోత్సవాల రోజు పోయాడు. అదృష్టవంతుడు. నూరేళ్లూ నిండాయి ఎవరో ముష్టాడు వచ్చాడు.'' స్పీడ్‌గా సైకిల్‌పై వెళ్తూ చెబుతున్నాడు కుర్రాడు జనానికి.

స్పీడ్‌గా అన్ని బళ్లు దూసుకువెళ్తున్నాయ్. ఎవరికీ పట్టలా. ఎవరికి వాళ్లు చూసిపోయేవారే చిత్రం.

జరిగిన సంఘటనలకి కళ్లనీళ్లు నిండాయి నాకు.

మనస్సులోనే అనుకున్నా మరోసారి 'వందేమాతరం' అని.

ఎస్‌టిడి బూత్‌లోంచి ఫోన్ చేసా మున్సిపాలిటీవారికి.

లలిత కళాతోరణం జనంతో కిటకిటలాడిపోతోంది. బాణాసంచాతో, పోలీసుల బూట్ల మోతతో దద్దరిల్లిపోతోంది. జీవంలేని తాత శవం రోడ్డుమీద కళ్లు తెరిచి నూరేళ్ల పండగెప్పుడా అని చూస్తూనే వుంది.

చూస్తూనే వుంది.

★